**కథ**

## "అమ్మా, నేను కార్తీక్‌ను పెళ్లి చేసుకోవాలనే నిర్ణయించుకున్నాను"

**సంధ్య మాటలు విని పెద్దగా ఆశ్చర్యపోలేదు వసుమతి. కూతురి మనస్తత్వం గురించి ఆమెకు పూర్తిగా తెలుసు.**

# నువ్వు మారతావని..

''బాగా ఆలోచించావా సంధ్యా, ఆవేశాన్నే ఆలోచన అనుకుంటున్నావా''

''లేదమ్మా, ఆలోచించాను''

''చూడు సంధ్యా, ఏ పనైనా చెయ్యాలనుకోవడానికి, చెయ్యడానికి చాలా తేడా వుందమ్మా. నువ్వు కార్తీక్‌ను మార్చడం అసాధ్యమనే నా అభిప్రాయం''

''అమ్మా, కార్తీక్‌కు డ్రింక్ చేసే అలవాటుందని పెళ్లయ్యాక తెలిస్తే ఏం చేసేవాళ్లం? అదేదో ముందే తెలిసింది. చిన్నగా అతనితో ఆ అలవాటు మాన్పించగలననే అనుకుంటున్నాను''

''సంధ్యా, అర్థం చేసుకో. ఇప్పుడు కార్తీక్‌ను పెళ్లి చేసుకోకపోతేనేం? అయినా అంత పట్టుదల వున్న దానివి పెళ్ళికి ముందే మాన్పించవచ్చుకదా''

''స్నేహితురాలికి, భార్యకు వున్న తేడానే నేను అనుకుంటున్న పని చేయించగలదమ్మా''

నలభై ఏళ్ల సంసార అనుభవం వున్న తనకు సరికొత్త పాఠాలు చెబుతున్న కూతురిని చూసి విస్తుపోయింది వసుమతి.


''మనిషిని అభిప్రాయాలు, అనుభవాలే మార్చలేవు సంధ్యా. ఇక అనుబంధాలు, నమ్మకాలు ఏపాటివి?''

''ఆ అనుబంధంతోనే సంవత్సరంలోపు కార్తీక్‌ను మార్చగలను. ప్లీజ్ అమ్మా, ఈ విషయంలో నువ్వు అడ్డు చెప్పకు''

తను అడ్డు చెప్పినా ప్రయోజనం వుండదని తెలిసిన వసుమతి మౌనాన్నే ఆశ్రయించింది.

★ ★ ★

సంధ్య, కార్తీక్ ఇద్దరూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. ఆఫీస్ పనిపట్ల అంకితభావం చూపించే కార్తీక్‌ను అభిమానించే వాళ్ల లిస్టులో చేరిపోయింది సంధ్య. ఆ అభిమానం స్నేహంగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. సంధ్య కోసం తరచూ ఇంటికి వచ్చే కార్తీక్‌పై సదభిప్రాయమే కలిగింది వసుమతి దంపతులకు. దాంతో వారిద్దరి పెళ్లికి పెద్దగా అభ్యంతర పెట్టలేదు. వారిద్దరూ వివాహం చేసుకోబోతున్న విషయం తెలిసిన ఆఫీస్ ఉద్యోగులంతా మనస్ఫూర్తిగా అభినందించారు మోహన్ తప్ప.



★ ★ ★

''మీరు, కార్తీక్ పెళ్లి చేసుకోబోతున్నారని

**శ్రీధర్ భద్రంరాజు**

విన్నాను నిజమేనా?'' అడిగాడు మోహన్. అతనూ అవివాహితుడే. అందంగా, చలాకీగా వుండే సంధ్య పైన సహజంగానే మనసు పారేసుకున్నాడు.

''ఊ. త్వరలో'' సమాధానమిచ్చింది సంధ్య.

''మీకు అభ్యంతరం లేకపోతే ఒక విషయం చెప్పదలుచుకున్నాను''

''చెప్పండి, ఏమిటది?''

''కార్తీక్ గురించి మీకు పూర్తిగా తెలియదనుకుంటాను'' ఆగాడు మోహన్.

''ఎందుకలా అనుకుంటున్నారు? అతని గురించి నాకు తెలియని విషయమేముంది?''

''అతడు డ్రింక్ చేస్తాడని కూడా తెలుసా?''

''డ్రింక్ చేస్తాడా?'' ఆశ్చర్యపోయింది సంధ్య.

''అవును సంధ్యగారూ, ఈ రోజుల్లో అది ఏమంత పట్టించుకోవాల్సిన విషయం కాదు అని మీరంటే నేనేమీ చెప్పలేను. కానీ అతను దాదాపు రోజూ తాగుతుంటాడు. ఇది మంచి అలవాటా కాదా అన్న చర్చ ఇప్పుడనవసరం. కానీ సంవత్సర కాలంగా మీరిద్దరూ స్నేహంగా వుంటున్నారు. ఈ

విషయం మీ దృష్టికి వచ్చిందో లేదో తెలుసుకోవాలనుకుంటున్నాను'' అన్నాడు మోహన్.

''ఊహు. నాకింతవరకూ ఈ విషయం తెలియనే తెలియదు''

''నేను జెలసీతో చెపుతున్నాననుకోకపోతే ఒక విషయం సంధ్యగారూ! డ్రింక్ చేయడం ఫ్యాషన్ అనుకునే సంస్కృతి ఇంకా మన మధ్య తరగతి వారికి అలవడలేదనుకుంటాను. అలాంటి ఫ్యాషన్లన్నీ సిల్వర్ స్పూన్‌తో పుట్టిన వాళ్లకే పరిమితం అనుకునే ధోరణి మనది. ఏమైనా, ఒక హితుడిగా మాత్రమే ఈ విషయం మీకు తెలియపరిచాను. మీకూ అలాంటివి ఇష్టమైతే మీరిద్దరి పెళ్లికి అభ్యంతర పెట్టడానికి నేనెవర్ని?''

★ ★ ★

'ఇంతకాలం ఈ విషయం తనకెందుకు చెప్పలేదు కార్తీక్. కేవలం 'బెటర్ సైడ్ ఆఫ్ ది ఫేస్' మాత్రమే చూపిస్తూ వచ్చాడా? కనీసం పెళ్లి ప్రసక్తి వచ్చినప్పుడయినా చెప్పి వుండాల్సింది. కాబోయే జీవిత భాగస్వామిపై ఆమాత్రం గౌరవం లేనివాడా కార్తీక్? అయినా డ్రింక్ చేసేవాళ్లంటే తనకు అయిష్టమని చెప్తూనే వున్నా ఆ అలవాటును ఎందుకు మానలేకపోయాడు? తనని మోసం చేద్దామనే ఉద్దేశ్యమా?'

''హాయ్ సంధ్యా. అంత పరధ్యానంలో వున్నావేంటోయ్?'' కార్తీక్ పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చింది సంధ్య.

''కార్తీక్, అలా బయటకు వెళ్దామా?''

''వైనాట్, ష్యూర్'' అంటూ దారితీశాడు.

''కార్తీక్, నేనొక విషయం అడుగుతాను. నిజం చెప్తావా?''

''ఏమిటది?''

''నీకు డ్రింక్ చేసే అలవాటుందా?''

''ఎవరు చెప్పారు?''

''నాక్కావలసింది నా ప్రశ్నకు సమాధానం. ఇంకో ప్రశ్న కాదు'' కాస్త కఠినంగానే అన్నది సంధ్య.

''ఊ, అప్పుడప్పుడు''

''మరి నాకెందుకు చెప్పలేదు?''

''చెప్పాలని అనుకునేంతలో నువ్వే అడిగావు. ఒంటరి పక్షిని కదా. ఏదో అలా అలవాటయింది.''

''అలవాటుతోనే ఆగిందా? వ్యసనం వరకూ వెళ్లిందా?''

''ఏయ్ సంధ్యా, ఎందుకింత ఇరిటేట్ అవుతున్నావు? ఏమంత పెద్ద విషయమిది?'' అంటున్న కార్తీక్ వైపు చురుగ్గా చూసింది సంధ్య. ఆ చూపులో మునుపటంత అభిమానం లేదు.

మానవ సంబంధాలన్నీ పేపచెట్టు కొమ్మల్లాంటివి. పచ్చగా, నిండుగా కనిపిస్తాయేకానీ నిజానికి అవి చాలా పెళుసు. ఏ చిన్న గాలికయినా తేలిగ్గా విరిగిపోతాయి.

★ ★ ★

చాలామంది ఆడవాళ్లలాగా భర్తలో తనకు నచ్చని విషయాలు చెప్పడానికి తొలి రాత్రిని వేదిక చేయలేదు సంధ్య. ఆ ఒక్క రాత్రే కాదు, ఏ రాత్రినీ ఆమె అందుకు ఉపయోగించదలచుకోలేదు. మరీ బలవంత పెట్టకుండా నెమ్మదిగా నచ్చచెప్పేందుకు ప్రయత్నించేది.

''డ్రింక్ చేసే అలవాటు లేని కార్తీక్ అంటే చచ్చేంత ఇష్టం నాకు'' అన్నదోసారి.

''ఆ అలవాటు వుంటే ఇష్టం లేదా''

''ఇష్టమే అనుకో. కానీ ఆ ఒక్కటీ..''

''సంధ్యా, నాకు నచ్చినట్లు నేనుంటూ, నీకు నచ్చినట్లు నువ్వుంటూ కూడా మనం ఒకరంటే ఒకరు ఇష్టంగానే వుండొచ్చు''

''అలా మాట్లాడకు కార్తీక్. మనిషి ఎదుగుదల విభిన్న కోణాల్లో వుండాలి. ఏ ఒక్క రంగంలోనో ఉన్నత స్థాయిలో వుంటే సరిపోదు. నీ పరిస్థితీ అంతే. మిగిలిన అన్నింట్లో నువ్వు ఓ.కే. కానీ ఆ వ్యసనం విషయంలో మాత్రం ఒప్పుకోలేం. కనీసం మానేయడానికి ప్రయత్నించకూడదూ''

''అంతగా నీకు ఇష్టం లేకపోతే ఆ కాసేపు నీకు దూరంగా వుంటాను. ప్లీజ్, ఆ విషయం ఇక మాట్లాడకు'' అన్నాడు కార్తీక్.

క్యాలెండర్‌లో పేజీలు మారడమే కాకుండా క్యాలెండరే మారిపోయింది. యధావిధిగా ఒక రోజు బాగా తాగి వచ్చాడు కార్తీక్.

''కార్తీక్, నేను చెప్పేది వినపడుతుందా, అర్థమయ్యే స్థితిలోనే వున్నావా నువ్వు?''

''ఊ... చెప్పు'' తూలుతున్నాడతను.

''ఓడిపోయాను కార్తీక్. దారుణంగా ఓడిపోయాను. నిన్ను సంవత్సరంలోపు మారుస్తానని అమ్మ దగ్గర తల ఎగరేశాను. కానీ నేను సాధించిందేమిటి? కార్తీక్, నీడ కేవలం చెట్టు మీదే కాకుండా సూర్యుడిపైన కూడా ఆధారపడి వుంటుందని తెలుసుకోకుండా ఆ రోజు అలా మాట్లాడాను. ఒక్క చేతితోనే చప్పట్లు కొట్టాలని ప్రయత్నించి భంగపడ్డాను. నేను వెళ్లిపోతున్నాను కార్తీక్. నీతో సంవత్సరం కలిసి వున్నాక తెలిసింది తాగాలనుకునే వాడికి వుండేది మానేయాలన్న ఆలోచన కాదని, తాగేందుకు ఒక కారణం వుంటే చాలని. ఇక నాకు ఓపిక లేదు కార్తీక్. ఎక్కడయితే నిన్ను మార్చగలనని ఛాలెంజ్ చేశానో అక్కడికే వెళ్లిపోతున్నాను. నువ్వు వస్తావనే నమ్మకం లేకపోయినా చెబుతున్నాను. నువ్వు నీ వ్యసనాన్ని వదిలిపెట్టిన తరువాతే మనం కలుసుందాం. టిల్ దెన్ గుడ్ బై''

''సంధ్యా, ప్లీజ్ ఆగు'' కార్తీక్ మాటలు వినిపించుకోకుండా అడుగు బయటపెట్టింది సంధ్య.

★ ★ ★

''నువ్వు రెండోసారి ఫూల్‌లా ప్రవర్తించావు సంధ్యా'' అంటున్న తండ్రివైపు ఆశ్చర్యంగా చూసింది సంధ్య.

''అవునమ్మా, లేకపోతే ఏమిటి? తాగేవాళ్ల భార్యలంతా వాళ్లను విడిచిపెడుతున్నారా?''


''అందరి విషయం నాకు అనవసరం నాన్నా''

''అదే వద్దనేది. అప్పుడు అమ్మ చెబుతున్నా వినకుండా పెళ్లి చేసుకున్నావు. ఆ రోజు అలా చేయకపోతే ఇప్పుడీ పరిస్థితి వచ్చేదా?''

''జరిగిపోయినదాన్ని తలచుకొని ఏం ప్రయోజనమండీ. అయినా సంధ్య మంచి పనే చేసిందనుకుంటున్నాను'' అంది వసుమతి.

''నువ్వు కూడా దాన్ని సమర్థిస్తున్నావా?''

''అవునండీ, సంధ్య పాతకాలం అమ్మాయి కాదు. భర్తలోని వ్యసనాలు కూడా క్షమించి పెద్ద బిరుదులేమీ పొందాలనుకోవడం లేదు ఇప్పటి అమ్మాయిలు. మనిషి మనిషి కాకపోవచ్చు కానీ మనిషి స్థాయి నుండి దిగజారకూడదు కదా. సర్దుకుపోయే గుణం భార్యాభర్తలిద్దరికీ వుండాలి. ఒకరి కోసం ఒకరు కనీసం కొన్నింటిని అయినా వదిలిపెట్టగలిగే స్థితిలో వుండాలి.




ఎవరిష్టప్రకారం వాళ్లు ప్రవర్తిస్తూ వుంటే ఇక ఆ దాంపత్యానికి అర్థమేమిటండీ?

ముందు కార్తీక్‌ను దేనికోసం ఏది వదిలిపెట్టాలో నిర్ణయించుకోనివ్వండి. అప్పటివరకూ అమ్మాయి ఇక్కడే వుంటుంది'' అన్నది వసుమతి.

విప్పారిన నేత్రాలతో తల్లి వంక చూస్తూ నిలబడింది సంధ్య వ్యసనరహితుడైన భాగస్వామిని కోరుకునే నవతరం ప్రతినిధిలా.